అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి

అల్వాల్: డివిజన్ ఆనంద్‌రావునగర్‌లో జరుగుతున్న నూతన మురుగునీటి లైన్‌ను బుధవారం కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పైపులైన్ పనులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ కాంట్రాక్టర్‌కు సూచించారు. ప్రేమ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

సత్కారం



శిల్పారెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీనేతలు

మల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా రెండోసారి ఎన్నికైనా డాక్టర్ శిల్పారెడ్డి, బీజేపీ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తూళ్ల వీరేందర్‌గౌడ్‌ను నాచారం డివిజన్‌కు చెందిన బీజేపీ నేతలు కలిసి శుబాకాంక్షలు తెలిపారు. జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మోహన్‌రెడ్డి, దయగౌడ్, వెంకటేష్, ఉదయ్‌కిరణ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్‌గుప్తా, బాలకృష్ణ, ఓంప్రకాష్, కిషోర్ తదితరులున్నారు.

భయాన్ని జయించే శక్తి మనలోనే ఉంది



బోడుప్పల్: భయాన్ని జయించే శక్తి మనలోనే ఉందని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బుధవారం బృందావన్ కాలనీలోని స్కూల్‌లో అభయ భవిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'జీవితం మనదే – జీవనం మనదే' అనే శీర్షికపై ఆత్మరక్షణపై శిక్షణను ఇచ్చారు. అభయ భవిత టీమ్ లీడర్స్ లక్ష్మి, విజయలక్ష్మి, గీత, ఇంద్రాక్షిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి



జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్

అల్వాల్: కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్‌ను బుధవారం మచ్చబొల్లారం కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ కలిసి వినతి పత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని, పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న పనులను వేగవంతం చేయాలని కోరారు. ఎస్ఈ చిన్నారెడ్డిని కలిసి వినపత్రం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి శ్రీశైలంయాదవ్ పాల్గొన్నారు.

పార్కు స్థలం పరిశీలన



వివరాలను సేకరిస్తున్న హైడ్రా అధికారులు

బోడుప్పల్: చెంగిచర్ల ద్వారకానగర్ ఫేస్– 1 కబ్జాకు గురైన పార్కు స్థలాన్ని హైడ్రా బృందం పరిశీలించారు. కాలనీవాసుల ఫిర్యాదు మేరకు అధికారులు సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హైడ్రా ఇన్‌స్పెక్టర్ పైదులు మాట్లాడుతూ.. పార్కుల పరిరక్షణకు హైడ్రా కట్టుబడి ఉందన్నారు. 1వ డివిజన్ ఇన్‌చార్జి కుర్రి శివశంకర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

కీసర ఆలయ హుండీ లెక్కింపు

కీసర: కీసరగుట్ట రామలింగేశ్వర దేవస్థానం ఆరు నెలల హుండీని రంగారెడ్డి జిల్లా సహాయ కమిషనర్ పర్యవేక్షణలో లెక్కించారు. బుధవారం హుండీ లెక్కించగా.. రూ.23,67,789 ఆదాయం, అన్నప్రసాదం వద్ద రూ.68,345 ఆదాయం వచ్చిందని వివరించారు. ఆలయ చైర్మన్ తటాకం నారాయణ, ఈఓ సుధాకర్ రెడ్డి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, నర్సింహ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

అసలు తప్పెవరిది..?

- చర్చల్లోకెక్కిన నవోదయనగర్
- రెసిడెన్షియల్ జోన్ కాస్తా.. మ్యానుఫాక్చరింగ్ జోన్‌గా మార్పు
- అధికారుల మధ్య సమన్వయ లోపం



నవోదయనగర్ పారిశ్రామికవాడ

కుషాయిగూడ: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన వేలకోట్ల డ్రగ్స్ తయారీ ముఠాగుట్టు రట్టు కావడంతో చర్లపల్లి, నవోదయనగర్ పారిశ్రామికవాడ ఒక్కసారిగా చర్చల్లోకి వచ్చింది. గతవారం రోజులుగా చర్లపల్లి పారిశ్రామికవాడతో పాటుగా సమీప పారిశ్రామికవాడల్లో ఎటు చూసినా ఇదే చర్చ సాగుతోంది. నిఘావర్గాల వైఫల్యం, తరచుగా తనిఖీలు చేయాల్సిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధికారుల ఉదాసీనతే ఈ అక్రమవ్యాపారాలకు ఆజ్యం పోస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ నవోదయనగర్‌లో వెలిసిన నిర్మాణాలు, షెడ్లన్నీ అక్రమ నిర్మాణాలేనంటూ వార్తలు వస్తుండటంతో ఇప్పటికే షెడ్‌లు నిర్మించుకుని కంపెనీలు నిర్వహిస్తున్న వందల మంది పారిశ్రామికవేత్తలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.

మాస్టర్‌ప్లాన్ రివైజ్ చేసిన సమయంలో..

చర్లపల్లి, నవోదయనగర్ రెసిడెన్షియల్ జోన్‌లో ఉండేది. 2008లో మాస్టర్‌ప్లాన్ రివైజ్ చేసిన సమయంలో నవోదయనగర్‌ను మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌గా నిర్ణయించారు. సరైన మార్గదర్శకాలు జారీచేయకపోవడంతో సమీపంలో ఉన్న ఐలా, జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్మాణాలకు అనుమతులను నిరాకరించారు. దీంతో ఎలాంటి అనుమతులు లేకుండానే అక్కడక్కడ షెడ్‌ల నిర్మాణాలను కొనసాగించారు. కాలక్రమేనా వందల సంఖ్యలో షెడ్‌లు వెలిశాయి. కాగా 2020లో చర్లపల్లి డివిజన్ పరిధిలోని మహాలక్ష్మీనగర్, బీఎన్ రెడ్డినగర్ ఈసీఐఎల్ ఆఫీసర్స్ కాలనీ, న్యూమింట్ కాలనీ, గాంధీనగర్, న్యూ రైల్వేకాలనీలను ఇండస్ట్రీయల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌కు మార్చగా.. నవోదయనగర్‌ను రెసిడెన్షియల్ నుంచి ఇండస్ట్రీయల్‌కు మార్చాలంటూ.. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓను జారీ చేసింది. నిర్మాణాల అనుమతుల కోసం ఎల్ఆర్ఎస్ కట్టుకోవచ్చని జీవోలో పేర్కొన్నారు. ఆ జీవో కాపీని జీహెచ్‌ఎంసీ అధికారులకు చూపితే మాకు ఎలాంటి మార్గదర్శకాలు లేవన్నారు. దీంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా మారింది.

2008 నుంచి అధికారుల చుట్టూ..

2008 నుంచి ఇప్పటి వరకు నవోదయనగర్ పారిశ్రామికవాడలో నిర్మాణాల అనుమతుల కోసం అసోసియేషన్ ప్రతినిధులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. చర్లపల్లి 'ఐలా' అధికారుల వద్దకు వెళ్తే మాకు సంబంధం లేదంటున్నారని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్‌ఎంసీని సంప్రదిస్తే తమ పరిధి కాదని చెబుతున్నారన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో నిర్మాణాలు చేపట్టి కంపెనీలను నిర్వహిస్తున్నామన్నారు. గత 15 ఏళ్లుగా సుమారు 200 యూనిట్లను నడిపిస్తూ.. ప్రత్యక్షం, పరోక్షంగా 7–8 వేలమందికి ఉపాధి చూపుతున్నారు. తాజాగా చోటు చేసుకున్న ఘటనతో అన్ని విభాగాల అధికారులు నవోదయనగర్ వైపుగా చూస్తుండటం వారిని కొంత ఆందోళనకు గురిచేస్తోంది.

17 ఏళ్లుగా తిరుగుతూనే ఉన్నాం..



మాస్టర్ ప్లాన్ రివైజ్ చేసిన సమయంలో రెసిడెన్షియల్‌జోన్‌లో ఉన్న చర్లపల్లి, నవోదయనగర్ కాలనీని మ్యానుపాక్చరింగ్ జోన్‌గా ప్రకటించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 17 ఏళ్లుగా అనుమతుల కోసం అధికారులు, మంత్రుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాం. ప్రస్తుత మార్కెట్‌కు అనుగుణంగా పన్నులు చెల్లించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. రెగ్యులరైజ్ చేసి సమస్యకు పరిష్కారం చూపండి.

– ఆనంద్‌కుమార్, నవోదయనగర్

అధికారుల పర్యవేక్షణ ఉండాలి



పారిశ్రామికవాడలపై అన్ని విభాగాల అధికారుల పర్యవేక్షణ ఉండాలి. వారి పర్యవేక్షణ లోపం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. విజిలెన్స్, డ్రగ్స్ కంట్రోల్ అథారిటీ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీస్ వంటి విభాగాల అధికారులు పారిశ్రామికవాడలో తరచుగా తనిఖీలు చేయాలి.

– గోవిందరెడ్డి, ఐలా చైర్మన్

అధికారుల సమన్వయ లోపం



చర్లపల్లి, నవోదయ నగర్‌లోని పారిశ్రామిక వాడలో నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకపోవడంతో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల నష్టం జరుగుతుంది. ఇన్నేళ్లుగా సమస్యకు పరిష్కారం లభించకపోవడానికి అధికారుల మధ్య సమన్వయం లేకపోవడమే కారణం. దీనిపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

– జొండ్ల ప్రభాకర్‌రెడ్డి, స్థానికుడు

పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



ప్రారంభోత్సవంలో ప్రత్యేకాధికారి పంకజ, వజ్రేష్‌యాదవ్

బోడుప్పల్: పార్కుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు బోడుప్పల్ ప్రత్యేక అధికారి పంకజ అన్నారు. బోడుప్పల్‌లో వంద రోజుల ప్రణాళిక అమలులో భాగంగా పలు కాలనీల్లో పిల్లలు ఆడుకునేందుకు పలు చిల్డ్రెన్స్ పార్కులను కమిషనర్ శైలజతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు, చిన్న పిల్లలను దృష్టిలో ఉంచుకుని హేమనగర్, రాజశేఖర్‌కాలనీ, మణికంఠ కాలనీలో పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. అనంతరం మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలు సేదతీరడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహారెడ్డి, బీ–బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నేతలు రాపోలురాములు, బొమ్మక్ సుగుణ బాలయ్య, సుమన్‌నాయక్ అధికారులు పాల్గొన్నారు.

'ఎన్జీఆర్ఐ'లో జియో థర్మల్ ఎనర్జీ రీసెర్చ్ సెంటర్



ప్రారంభోత్సవంలో సైంటిస్టులతో రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ కలైసెల్వి

ఉప్పల్: 'ఎన్జీఆర్ఐ'లో జియో థర్మల్ ఎనర్జీ రీసెర్చ్ సెంటర్‌ను కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ డైరెక్టర్ జనరల్ డా. కలైసెల్వి, ఎన్జీఆర్ఐ డైరెక్టర్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత దేశ ఇంధన వనరుల కల్పనలో మరో మైలురాయిని దాటిందని ప్రశంసించారు. ఆధునిక శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణల ద్వారా భారతదేశం విస్తారమైన భూ ఉష్ణ సామర్థ్యాన్ని ఉపయోగించుకునే లక్ష్యంతో హైదరాబాద్‌లోని ఎన్జీఆర్ఐలో ఈ కేంద్రం స్థాపించినట్లు పేర్కొన్నారు. సీఎస్ఐఆర్– ఎన్ఏఎల్ డైరెక్టర్ డా. అభయ్‌అనంత పాశీల్కర్, సీఎస్ఐఆర్ 4పీఐ డైరెక్టర్ డా. జీకే.పాత్రతో సీనియర్ ప్రిన్సిపాల్ సైంటిస్టు డా. లబానీరే, ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారిపై లైంగిక దాడి..

నిందితుడికి మూడేళ్ల జైలు

అల్వాల్/మేడ్చల్: జుడిషియల్‌లోని అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి మేడ్చల్ పోక్సో కోర్టు జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. కోర్టులో ప్రభుత్వం తరుపున న్యాయవాది విజయ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగేళ్ల చిన్నారిపై విజయ్‌కుమార్ అనే వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించి, లైంగిక వేధింపులకు గురిచేయడంతో అల్వాల్ పోలీసులు నిందితుడి అరెస్ట్ చేశారు. అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా.. మేడ్చల్ పోక్సో కోర్టు న్యాయమూర్తి అమరావతి బుధవారం తీర్పు వెల్లడించారు. నిందితుడికి మూడేళ్ల జైలు రూ.,10వేల జరిమానా, బాలికకు రూ.20వేల నష్టపరిహారం చెల్లించాలని తీర్పునిచ్చారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

కుషాయిగూడ: డివిజన్ సమస్యలపై మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ బుధవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పలు సమస్యలను వివరించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రధానంగా కృష్ణానగర్ సీనియర్ సిటిజన్ భవనం, రాజీవ్‌నగర్‌లో యూత్ బిల్డింగ్, కైలాసగిరిలో 30 ఫీట్ల రోడ్డు నిర్మాణం, లక్ష్మీనగర్, నోమా కల్యాణమండపం వద్ద శ్మశాన వాటికల్లో మౌలిక వసతుల కల్పన వంటి అంశాలను జెడ్సీ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరినట్లు ప్రభుదాస్ తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం



మల్లాపూర్: హిందీ భాషా దినోత్సవాన్ని నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్కూల్ చైర్మన్ నవనీత రావు హాజరై మాట్లాడారు. దేశ సంస్కృతి, భాషా వైవిధ్యమైన హిందీ భాషకు ఉన్న స్థానం అమోఘమన్నారు. ప్రతి విద్యార్థి హిందీని గౌరవంతో నేర్చుకోవాలన్నారు. విద్యార్థులు హిందీభాషలో తమ ప్రతిభను చూపిస్తూ.. వివిధ ప్రదర్శనలు చేసి చూపించారు. హిందీగీతాలు, పాటలపై నృత్యాలు అలరించాయి. వ్యాసరచనలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని తదితరులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



కాలనీవాసులతో కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సీసీరోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కార్పొరేటర్ శ్రవణ్ సూచించారు. బుధవారం సీతారాంనగర్‌లో రూ.20 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. దీర్ఘకాలికంగా రోడ్డు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలంటే నాణ్యత పాటించడం ముఖ్యమన్నారు. రోడ్డు నిర్మాణ సమయంలో డ్రైనేజీ పైపులైన్లు కూడా ప్రజలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అన్ని కాలనీల్లో దశలవారీగా సీసీరోడ్ల నిర్మాణం చేపడతామన్నారు. అనంతరం బలరాంనగర్‌లో ఇటీవల పూర్తయిన యూజీడీని పరిశీలించారు. డీఈ మహేష్, ఏఈ నవీన్, వీఐ రమేష్, మదన్, సాయిబాబా, రమేష్, సుమంత్ పాల్గొన్నారు.

వెరిఫికేషన్‌తో నేరాలకు అడ్డుకట్ట



సర్టిఫికెట్లను చెక్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

మల్లాపూర్: గృహ సేవకుల వెరిఫికేషన్‌తో నేరస్తులను ముందుగానే గుర్తించవచ్చని నాచారం ఇన్‌స్పెక్టర్ రుద్వీర్‌కుమార్ అన్నారు. బుధవారం నాచారం రహేజా విస్టాస్ క్లబ్‌హౌస్‌లో గృహసేవకుల వెరిఫికేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇళ్లలో పనిచేసే పనివారు, వంటమనుషులు, డ్రైవర్లు, కేర్ టేకర్లు వంటి సర్వీస్ ప్రొవైడర్ల నేర చరిత్రను చెక్ చేశారు. దాదాపు 100 మ ందికి పైగా పనివాళ్ల బయోమెట్రిక్‌లను సేకరించారు. ఎస్సై మైబెల్లి, రహేజా విస్టా సొసైటీ అధ్యక్షుడు మనోజ్ శంరమంచి, సంయుక్త కార్యదర్శి నిషాంత్, శేషగిరిరావు, శివ, కిషోర్, రమేష్‌బాబు తదితరులున్నారు.

రూ.2 కోట్లతో డ్రైనేజీ నిర్మాణ పనులు

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో భూగర్భ డ్రైనేజీ పనులకు సుమారు రూ.2 కోట్ల నిధుల మంజూరయ్యాయని నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ అన్నారు. గురువారం జలమండలి మేనేజర్ సిరాజుద్దీన్‌తో పనులపై సమీక్షించారు. త్వరలోనే పనులను మొదలు పెట్టాలని ఆదేశించారు. రాఘవేంద్రనగర్ కాలనీలో కొత్తగా తాగునీటి పైపులైన్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సీవరేజ్ సూపర్‌వైజర్ రాకేష్, బీఆర్ఎస్ సీనియర్ నేత నమిలికొండ భూపాల్‌రెడ్డి తదితరులున్నారు.



మేనేజర్‌తో సమీక్షిస్తున్న కార్పొరేటర్ శాంతి

ఆలోచింపజేసేలా 'ఆత్మ నిర్భయ సదస్సు'



మాట్లాడుతున్న మోత్కూరి రామచంద్ర

అల్వాల్: ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హెలెన్ కెల్లర్ కళాశాలలో ఆత్మ నిర్భయ సదస్సు నిర్వహించారు. బుధవారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సైకాలజిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు డీపీ.మోత్కూరి రామచంద్ర హాజరై విద్యార్థులకు పలు టెక్నిక్స్‌ను నేర్పించారు. టెక్నిక్స్ ద్వారా టెన్షన్ నుంచి ఒత్తిళ్ల నుంచి ఎలా బయటకు రావాలో అవగాహన కల్పించారు. కళాశాల చైర్మన్ లయన్ ప్రొఫెసర్ పఠాన్ ఉమర్‌ఖాన్, అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ రాజ్ ఆచార్య, సీనియర్ సైకాలజిస్ట్ నారాయణ, తులసి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ముగం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసుల కృషి అభినందనీయం



డీసీపీతో భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులు

మల్కాజిగిరి: సర్కిల్‌లో గణేష్ నిమజ్జనం విజయవంతంకావడంలో పోలీసుల కృషి అభినందనీయమని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నాయకులు నవీన్, రుత్విక్ అన్నారు. బుధవారం మల్కాజిగిరి డీసీపీ పద్మజను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఎలాంటి ఇబ్బందులు, ఘటనలు జరగకుండా భద్రతా చర్యలు తీసుకున్నారని, అన్నింటికంటే ముఖ్యంగా రాజకీయపార్టీలు వేర్వేరుగా స్వాగత వేదికలు ఏర్పాటు చేయకుండా భాగ్యనగర్ ఉత్సవసమితి ఆధ్వర్యంలో ఒకే వేదికను ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. బాలచందర్‌గౌడ్, జూపల్లి శ్రీనివాస్, స్పైడర్ శ్రీనివాస్, వెంకట్, పృథ్వి, పవన్, మహేష్ పాల్గొన్నారు.

ఆర్థికఇబ్బందులతో జిమ్ ట్రైనర్ ఆత్మహత్య



వినోద్ (ఫైల్)

అల్వాల్: ఆర్థిక ఇబ్బందులతో వ్యాయామశాల (జిమ్ ట్రైనర్) శిక్షకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపురంకు చెందిన వినోద్ (33) జిమ్ ట్రైనర్‌గా పని చేస్తుంటాడు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటు పడిన వినోద్ పలుచోట్ల అప్పులు చేశారు. కొంతమేర కుటుంబసభ్యులు సర్దుబాటు చేసినప్పటికీ సమస్యలు అధికం కావడంతో భరించలేక ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీర వనిత చాకలి ఐలమ్మ

వీరనారి చిట్యాల ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకమని ఉప్పల్, మల్కాజిగిరి జోన్ పరిధిలో పలువురు ప్రజా ప్రతినిధులు కొనియాడారు. బుధవారం ఆమె వర్ధంతిని ఘనంగా నిర్వహించి, చిత్రపటం, విగ్రహం వద్ద ఘనంగా నివాళులర్పించారు.పలువురు మాట్లాడుతూ.. భూమి, భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తికి పోరాడిందని ఆమె పోరాట స్ఫూర్తి ఆదర్శనీయమన్నారు.

– ఉప్పల్ మల్కాజిగిరి జోన్ల బృందం



కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్‌రెడ్డి



చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న దృశ్యం



ఉప్పల్ అంబేద్కర్ చౌరస్తాలో రజక సంఘం ప్రతినిధులు



ఈసీఐఎల్ చౌరస్తాలో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి తదితరులు



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి



చిలుకానగర్‌లో..



ఇందిరానెహ్రూనగర్ కమ్యూనిటీహాల్ వద్ద..